GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 7 | సంచిక : 201 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | ఆదివారం 12-01-2025 | పేజీలు : 3

## ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులను తీసుకోండి

- సీఎం చంద్రబాబు సూచన



**టీ మీడియా, జనవరి 11,అమరావతి:**

సంక్రాంతికి పెద్దసంఖ్యలో పొరుగు రాష్ట్రాల్లో ఉన్న ప్రజలు ఏపీకి తరలివస్తున్నారు. సొంత గ్రామాలకు వస్తున్న లక్షలమంది ప్రయాణికులకు సరిపడా బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ప్రయాణికుల రద్దీతో విశాఖ, రాజమండ్రి, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు, అనంతపురం సహా పలు నగరాల్లోని బస్టాండ్లు కిటకిటలాడుతున్నాయి. ఈ క్రమంలోనే పండగకు వచ్చే ప్రజల ఇబ్బందులను తీర్చేందుకు ప్రభుత్వం ప్రయత్నాలను ముమ్మరం చేసింది.ఇందులో భాగంగా ప్రైవేట్, స్కూళ్లు, కాలేజీల బస్సులను తీసుకోవాలని చంద్రబాబు పేర్కొన్నారు. తద్వారా ప్రయాణికులను ప్రధాన పట్టణాల నుంచి పల్లెలకు పంపే ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. టీడీపీ కార్యాలయంలో చంద్రబాబు మీడియాతో చిట్?చాట్? నిర్వహించిన ఆయన అందులో వచ్చిన సూచనపై సమీక్షించి వెంటనే ఆదేశాలిచ్చారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, రవాణా శాఖ అధికారులను ఆదేశించారు.ఫిట్?నెస్ ఉన్న బస్సులను ఆర్టీసీ ద్వారా నడిపి ప్రజలకు ప్రయాణ కష్టాలు లేకుండా చూడాలని చంద్రబాబు సూచించారు. తీవ్ర రద్దీగా ఉన్న రూట్లలో ఈ తరహా బస్సులతో కొంత మేర ప్రజలకు సౌకర్యం కల్పించాలని సీఎం అభిప్రాయపడ్డారు. తద్వారా ప్రజలను సురక్షితంగా వారి వారి గమ్యస్థానాలకు పంపే ఏర్పాట్లు చేయాలని చంద్రబాబు సూచనలు చేశారు.

# కాశ్మీర్ లోయలో మరో సొరంగం..



- గేమ్ ఛేంజర్ కానున్న టన్నెల్ ప్రాజెక్ట్

**టీ మీడియా, జనవరి 11, ఢిల్లీ:**

కాశ్మీర్ లోయలో చలికాలం కురిసే మంచు రవాణా వ్యవస్థను స్తంభింపజేస్తుంది. లోయను దాటి ఎటు వెళ్లాలన్నా ఎత్తైన హిమాలయ పర్వత శిఖరాలను దాటి వెళ్లాల్సి ఉంటుంది. ఎత్తైన ప్రాంతాల్లో కొన్ని అడుగుల నుంచి మీటర్ల ఎత్తున కురిసే భారీ హిమపాతం రోడ్డు మార్గాలను పూర్తిగా మూసేస్తుంది. దీంతో కొన్ని నెలల పాటు ఆయా పర్వతాల మీదుగా సాగే ప్రయాణాలు నిలిచిపోతుంటాయి. పర్వత శ్రేణుల్లో నివసించే గ్రామాలు, పట్టణాలకు బయటి ప్రపంచంతో సంబంధాలు పూర్తిగా తెగిపోతుంటాయి. ఈ పరిస్థితిని నివారించాలంటే పర్వతాలను అడ్డంగా తొలుస్తూ సొరంగాలను నిర్మించాల్సిందే..

ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అదే పని చేస్తోంది. శ్రీనగర్‌ను రోడ్డు మార్గంలో నిరంతరం అనుసంధానించేందుకు అన్ని వైపులా టన్నెళ్లను నిర్మిస్తోంది. జమ్ము నుంచి శ్రీనగర్ చేరుకునే మార్గంలో చెనాని- నష్రి మధ్య నిర్మించిన డా. శ్యామప్రసాద్ ముఖర్జీ టన్నెల్, బనిహాల్ -ఖాజీగుండ్ రోడ్ టన్నెల్, జవహర్ టన్నెల్ పలు పర్వతాలను సునాయాసంగా దాటేలా చేస్తున్నాయి. చెనాని-నష్రి మధ్య టన్నెల్ నిర్మించకముందు పట్నిటాప్ మీదుగా సాగించే ప్రయాణానికి దూరాభారంతో పాటు చలికాలంలో హిమపాతం కారణంగా రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించే పరిస్థితులు ఉండేవి. కానీ ఇప్పుడు రోడ్డు మార్గంలో కొండచరియలు విరిగిపడితే తప్ప ఏ కాలంలోనైనా ప్రయాణం చేయడానికి వీలుంది. తాజాగా శ్రీనగర్‌కు బయటి ప్రపంచంతో రైలు మార్గం ద్వారా కనెక్టివిటీని కల్పించేందుకు చీనాబ్ నదిపై ఇంజనీరింగ్ అద్భుతంగా తీర్చిదిద్దిన 'చీనాబ్ రైల్ బ్రిడ్జి'తో పాటు ఏకంగా 55 టన్నెళ్లను భారత ప్రభుత్వం నిర్మించింది. అతి త్వరలో శ్రీనగర్‌కు నేరుగా రైల్వే కనెక్టివిటీని కల్పిస్తూ ఈ మార్గాన్ని ప్రారంభించేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

### శ్రీనగర్ , కార్గిల్ మార్గంలో టన్నెల్

ఇదిలా ఉంటే శ్రీనగర్‌ను మరోవైపు నుంచి లద్దాఖ్ ప్రాంతంలోని కార్గిల్, లేహ్ పట్టణాలతో అనుసంధానించే రోడ్డు మార్గంలోనూ పలు టన్నెళ్లను కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తోంది. అందులో గండేర్‌బల్ జిల్లాలో నిర్మించిన జెడ్-మోర్హ్ టన్నెల్ ప్రారంభానికి సిద్ధమైంది. ఈ టన్నెల్ శ్రీనగర్ %-% సోనామార్గ్ మధ్య ప్రయాణదూరాన్ని తగ్గించడంతో పాటు హిమపాతం వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ సోనామార్గ్ పట్టణానికి నిరంతరాయంగా కనెక్టివిటీని అందిస్తుంది. హిందూ తీర్థయాత్రల్లో అత్యంత క్లిష్టమైన 'అమర్‌నాథ్ యాత్ర'లో సోనామార్గ్ ఒక కీలక మజిలీ. బాల్తాల్ బేస్ క్యాంప్ చేరుకోవాలంటే సోనామార్గ్ పట్టణాన్ని దాటుకుని వెళ్లాల్సి ఉంటుంది. పైగా అమర్‌నాథ్ యాత్రలో హెలీకాప్టర్ ద్వారా వెళ్లేవారు సోనామార్గ్‌లోని హెలీప్యాడ్ నుంచే వెళ్లాల్సి ఉంటుంది. ఆధ్యాత్మికంగానే కాదు, పర్యాటకంగానూ సోనామార్గ్ కీలక ప్రాంతం. అనేక అడ్వెంచర్ టూర్స్, మంచుపై క్రీడలు ఇక్కడ జరుగుతుంటాయి. ప్రపంచవ్యాప్తంగా అనేక మంది పర్యాటకులు ఈ ప్రాంతాన్ని సందర్శిస్తూ ఉంటారు.ఆధ్యాత్మకం, పర్యాటకం కంటే కూడా భారత ప్రభుత్వానికి ఈ టన్నెల్ వ్యూహాత్మకంగా కీలకంగా మారనుంది. శ్రీనగర్ %-% లేహ్ మార్గంలో ఉన్న ద్రాస్, కార్గిల్ పట్టణాలకు చేరుకోవాలన్నా ఇదే మార్గం నుంచి వెళ్లాల్సి ఉంటుంది. ఈ క్రమంలో సముద్రమట్టానికి 3,528 మీటర్ల (11,578 అడుగుల) ఎత్తున ఉన్న జోజిలా పాస్ మీదుగా ప్రయాణం సాగించాలి. హిమపాతం కారణంగా నవంబర్ నుంచి మే నెల వరకు జోజిలా పాస్ ప్రయాణం చేయడానికి వీల్లేగుండా మూసుకుపోతుంది. గతంలో కార్గిల్ ప్రాంతంలో పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు దుశ్చర్యలకు పాల్పడగా.. భారత్ ఏకంగా యుద్ధం చేయాల్సి వచ్చింది. శీతాకాలంలో తీవ్రంగా మంచు కురిసే సమయాన్ని ఆసరా చేసుకుని ఉగ్రవాదులు భద్రతా బలగాలపై దాడులకు తెగబడ్డారు. ఒకవేళ కార్గిల్ ఉగ్రవాదుల హస్తగతమైతే.. శ్రీనగర్ %-% లేహ్ మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయేవి. అందుకే భారతదేశ రక్షణలో ఈ మార్గం కీలకం, వ్యూహాత్మకం. ఈ క్రమంలో శ్రీనగర్ %-% లేహ్ మార్గంలో ప్రతికూల వాతావరణం, తీవ్ర హిమపాతం సమయంలోనూ రవాణా వ్యవస్థకు విఘాతం కలుగకుండా ఉండేందుకు పలు సొరంగాలను భారత సర్కారు నిర్మిస్తోంది. ఇవి రవాణా వ్యవస్థతో పాటు రక్షణ వ్యవస్థకు కూడా కీలకంగా మారనున్నాయి. జోజిలా పాస్ కంటే ముందుగా వచ్చే జెడ్-మోర్హ్ టన్నెల్ నిర్మాణం పూర్తిచేసుకోగా, 14.2 కి.మీ పొడవుతో జోజిలా టన్నెల్ వడివడిగా నిర్మాణం జరుపుకుంటోంది. ఏడాది పొడవునా శ్రీనగర్ %-% లేహ్ మధ్య రాకపోకలు సాగించడంలో జోజిలా టన్నెల్‌తో పాటు జెడ్-మోర్హ్ టన్నెల్ కీలకమైనవి.

### ప్రధాని చేతుల మీదుగా ప్రారంభం

మొత్తం 6.5 కి.మీ పొడవైన జెడ్-మోర్హ్ టన్నెల్‌ను జనవరి 13న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. దీని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ. 2,400 కోట్లు వెచ్చించింది. జమ్ము-కాశ్మీర్, లద్దాఖ్ ప్రాంతాల్లో ద్రాస్, కార్గిల్ సెక్టార్లలో భద్రతా విధులు నిర్వహించే సైనికులకు సైతం ఈ టన్నెల్ కీలకంగా మారనుంది. ప్రధాని స్వయంగా టన్నెల్ ప్రాంతానికి చేరుకుని ప్రారంభించనున్నారు. ప్రధానితో పాటు ఈ కార్యక్రమంలో కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, రాష్ట్ర ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా హాజరుకానున్నారు. తొలుత ప్రధాని వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారని చర్చ జరిగింది. కానీ వ్యూహాత్మకంగా కీలకమైన ఈ ప్రాజెక్టును మోదీ భౌతికంగా అక్కడికి చేరుకుని ప్రారంభించాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది.

## తెలంగాణలో కొత్త రేషన్ కార్డులు

- సామాజిక, ఆర్థిక సర్వేడేటా ప్రకారమే జారీ
- 30 లక్షల మంది అర్హులు



**టీ మీడియా, జనవరి 11,హైదరాబాద్:**

తెలంగాణలో కొత్త రేషన్ కార్డులపై మరో అప్‌డేట్ వచ్చింది. అస్సలు లేనివారికి కొత్త కార్డులు జారీ చేయడంతోపాటు ఇప్పటికే ఉన్న కార్డుల్లో ఫ్యామిలీ మెంబర్ల పేర్లను చేర్చాలని అభ్యర్థిస్తూ పెట్టుకున్న అప్లికేషన్లన సర్కారు ఆమోదించింది. దీంతో దాదాపు 30 లక్షల మందికి కొత్తగా రేషన్ అందనున్నట్లు తెలిసింది. కొత్తగా ఇషఉ్య చేయున్న కార్డులపై సీఎం రేవంత్, సివిల్ సప్లైస్ మంత్రి ఉత్తమ్ సంతకాలు ఉంటాయి. జనవరి 26 నుంచి నూతన రేషన్ కార్డ్స్ ఇవ్వనున్నారు. గతంలో ఉన్న పాత రేషన్ కార్డులకు సంబంధించిన వివరాలను కూడా ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. కొత్త రేషన్‌కార్డుకు సంబంధించిన డిజైన్ ప్రక్రియకు ఇంకొంత సమయం పట్టే అవకాశముందని పౌరసరఫరాల అధికారులు తెలిపారు.కొత్త కార్డుల జారీకి అప్లికేషన్స్ తీసుకోవాల్సిన అవసరం లేదని అధికారులు చెబుతున్నారు మొన్నామధ్య జరిగిన సామాజిక, ఆర్థిక సర్వేలో పేదల డేటాఉందని.. అందులోనే రేషన్ కార్డులు.. ఉన్నవారి.. లేనివారి వివరాలు ఉందని వివరిస్తున్నారు. ఆ మేరకు అర్హుల లిస్ట్‌ను గ్రామ సభలు, బస్తీ సభల్లో పొందుపరచనున్నారు. కాగా తెలంగాణలో ప్రస్తుతం అన్నపూర్ణ స్కీమ్, అంత్యోదయ కార్డుల కలిపి 89.96 లక్షల మందికి రేషన్?కార్డులున్నాయి. ఆ రేషన్?కార్డుల పరిధిలో 2.1 కోట్ల మంది ఉన్నారు. వైట్ రేషన్ కార్డు ఉన్నవారికి 6 కేజీల బియ్యం అందుతుంది. ఇందులో కేంద్రం నుంచి 5 కిలోలు ఇస్తుండగా, రాష్ట్రం నుంచి 1 కిలో ఇస్తుంది. అన్నపూర్ణ స్కీమ్?కింద ఉన్న 5,416 కార్డులకు 10 కిలోల బియ్యాన్ని రాష్ట్రం ఇస్తుండగా.. అంత్యోదయ కార్డులు ఉన్న 5.66 లక్షల మందికి కేంద్రం 35 కేజీల బియ్యం ఇస్తుంది.

## సంక్రాంతి ఎఫెక్ట్

- కిటకిటలాడుతున్న బస్‌స్టేషన్లు,
- బస్సులు, రైళ్లలో సీట్లు దొరక్క అవస్థలు

**టీ మీడియా, జనవరి 11,హైదరాబాద్::**

సంక్రాంతి పండుగ నేపథ్యంలో రద్దీతో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు కిటకిటలాడుతున్నాయి. పండుక్కి సొంతూరు వెళ్లేందుకు జనం పోటెత్తడంతో ప్రయాణ ప్రాంగణాలు కిక్కిరిసిపోతున్నాయి. హైదరాబాద్ నుంచి పల్లెలకు ప్రజలు భారీగా కదలివెళ్తున్నారు. సికింద్రాబాద్, జేబీఎస్, ఎంజీబీఎస్, కూకట్‌పల్లి, దిల్‌సుఖ్‌నగర్‌లోని బస్టాండ్లు ప్రయాణికుల రద్దీతో కిటకిటలాడుతున్నాయి. పండుగపూట స్వగ్రామాలకు వెళ్దామంటే చాలీచాలని బస్సులు, రైళ్లలో సీట్లు దొరక్క అవస్థలు తప్పడం లేదని జనం వాపోయారు.సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్తున్న ప్రయాణికులతో హైదరాబాద్‌లోని ప్రయాణ ప్రాంగణాలు కిటకిటలాడుతున్నాయి. ఎంజీబీఎస్, జేబీఎస్ తోపాటు కూకట్‌పల్లి, ఆరాంఘర్, దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్, ఎల్బీనగర్ కూడలి, వనస్థలిపురం, హయత్‌నగర్ వద్ద వాహనాల రద్దీ నెలకొంది. ప్రధానంగా ఏపీకి వెళ్లే రోడ్లపై రద్దీ కనిపిస్తుండగా సంక్రాంతి పండగ కోసం దాదాపు 6 వేల 432 బస్సులను నడుపుతున్నట్లు టీజీఎస్ ఆర్టీసీ తెలిపింది. హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారిపై వాహనాల రద్దీ నెలకొంది. వాహనాలు భారీగా తరలివెళ్లడంతో నగరం దాటేందుకు గంటల కొద్దీ సమయం పట్టింది.

### గంటలకొద్దీ వేచి చూడాల్సిన పరిస్థితి

రాష్ట్రంలో రెండో ప్రధాననగరం వరంగల్‌లోనూ రద్దీ నెలకొంది పండగరద్దీతో హనుమకొండ బస్టాండ్ జనసంద్రంగా మారింది. ఏకశిలా నగరం నుంచి సమీపంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లేవారు సరిపడా బస్సులు లేక గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. రద్దీకి సరిపడా బస్సులు నడపకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని వాపోయారు .



రైల్వే స్టేషన్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. జనంరద్దీదృష్ట్యా రైల్వేశాఖ పలుప్రాంతాలకి ప్రత్యేక రైళ్లు నడుపుతోంది. హైదరాబాద్ మెట్రో రైళ్లలోనూ రద్దీ కొనసాగుతోంది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ఎల్బీనగర్, మియాపూర్, సికింద్రాబాద్, ఎంజీబీఎస్, జేబీఎస్ తదితర ప్రాంతాలకు చేరుకునేందుకు ప్రజలు మెట్రో రైళ్లలో ప్రయాణించారు. హైదరాబాద్ నుంచి విజయవాడ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర వెళ్లే వారు ఎక్కువ మంది రైళ్లలో సీట్లు దొరక్క అవస్థలు పడ్డారు. ప్రత్యేక రైళ్లలో అన్‌రిజర్వ్‌డ్ సీట్లు ఎక్కువగా ఉంటే ఉపయోకరమని చెబుతున్నారు. ప్రత్యేక సర్వీసుల్లోనూ మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని ఆర్టీసీ అధికారులు స్పష్టం చేశారు.

## నెలాఖరులో కొత్త ఉస్మానియాకి శంకుస్థాపన

- అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష



**టీ మీడియా, జనవరి 11,హైదరాబాద్:**

గోషామహల్‌లో కొత్త ఉస్మానియా ఆసుపత్రికి నెలాఖరు వరకు శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణంపై అధికారులతో ఆయన సమీక్షించారు. గోషామహల్‌లో ప్రతిపాదిత స్థలానికి చెందిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌శాఖ పరిధిలో ఉన్న ఆ స్థలాన్ని వీలైనంత త్వరగా వైద్యారోగ్యశాఖకు బదిలీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.రెండుశాఖల మధ్య భూ బదలాయింపు ప్రక్రియ, ఇతర పనులను వీలైనంత త్వరగా పూర్తిచేయాలన్నారు. ప్రతిపాదిత స్థలంలో చేపట్టాల్సిన నిర్మాణాలకు చెందిన నమూనా మ్యాప్‌లని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అధికారులు సూచించిన మ్యాప్‌లలో సీఎం పలు మార్పులు, చేర్పులు సూచించారు. అన్ని రకాల ఆధునిక వసతులుడేలా ఆసుపత్రి నిర్మాణం ఉండాలన్న ముఖ్యమంత్రి భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని రోడ్లు, పార్కింగ్, మార్చురీ, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.భవిష్యత్తులో రహదారి విస్తరణ, ఫ్లైఓవర్ వంటి నిర్మాణాలు చేపట్టినా ఇబ్బంది తలెత్తకుండా ఉండేలా ముందుచూపుతో డిజైన్లను రూపొందించాలని నిర్దేశించారు. అత్యాధునిక వసతులతో పాటు రోగుల సహాయకులు సేద తీరేందుకు గ్రీనరీ, పార్క్ సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకి ధీటుగా అత్యాధునిక వసతులతో ఆసుపత్రి నిర్మాణం ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు.ఆసుపత్రికి అవసరమైన వివిధ విభాగాలతో పాటు అకడమిక్ బ్లాక్, నర్సింగ్ ఉద్యోగులకు హాస్టళ్లు కూడా నిర్మించాలని సీఎం రేవంత్? రెడ్డి ఆదేశించారు. కార్పొరేట్ తరహాలో వైద్య విభాగాలు, అన్ని సేవలు అక్కడే అందుబాటులో ఉండాలని సూచించారు. ఇప్పుడున్న ఉస్మానియా ఆస్పత్రి భవనాలను చారిత్రక కట్టడాలుగా పరిరక్షిస్తామని మూసీ రివర్ డెవలప్?మెంట్? ప్రాజెక్టులో భాగంగా పర్యాటకులను ఆకట్టుకునే చారిత్రక భవనాలుగా తీర్చిదిద్దుతామని సీఎం గతంలోనే ప్రకటించారు.ఉస్మానియా భవనం సురక్షితం కాదని, ఆసుపత్రికి పనికిరాదని రెండేళ్ల క్రితమే నిపుణుల కమిటీ తేల్చింది. భవనానికి మరమ్మతులు చేసినప్పటికీ ఆసుపత్రికి కాకుండా ఇతర అవసరాలకే ఉపయోగించవచ్చని తెలిపింది. వారసత్వ కట్టడమైనందున ఉస్మానియా భవనానికి ఆర్కిటెక్ట్ పర్యవేక్షణలో మరమ్మతులు చేయవచ్చని సూచించింది. దీంతో ప్రభుత్వం కొత్త ఆసుపత్రి నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేసింది.

## విమానాల్లో ప్రయాణించే వారికి షాక్

- కనీస ఛార్జీ రూ. 17 వేల పై మాటే




**టీ మీడియా, జనవరి 11,హైదరాబాద్:**

సంక్రాంతి పండుగ నేపథ్యంలో పట్టణాల్లోని ప్రజలంతా పెద్ద ఎత్తున తమ తమ సొంతూళ్లకు వెళ్తుండటంతో బస్సులు, రైళ్లు కిక్కిరిసిపోతున్నాయి. మూడు, నాలుగు నెలల క్రితమే ట్రైన్‌కు రిజర్వేషన్ చేసినా వెయిటింగ్ లిస్టులు మాత్రం భారీగా ఉన్నాయి. ప్రత్యేక బస్సులు, రైళ్లు వేసినా నిమిషాల వ్యవధిలోనే సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో నిండిపోతున్నాయి. ఈ క్రమంలోనే ప్రయాణికులు ప్రత్యామ్నాయ దారులను వెతుక్కుంటున్నారు. దీంతో విమాన టికెట్లకు డిమాండ్ ఒక్కసారిగా పెరిగింది.

**కనీస ఛార్జీ రూ. 17 వేల పై మాటే**

హైదరాబాద్, బెంగళూరు నుంచి వైజాగ్ వెళ్లాలనుకునే వారికి విమాన టికెట్ ధరలు షాక్ ఇచ్చాయి. జనవరి 11 శని, 12 ఆదివారాల్లో హైదరాబాద్ నుంచి కనీస ఛార్జీ రూ.17,500కి పై మాటే ఉండటంతో ప్రయాణికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. బెంగళూరు నుంచి వైజాగ్ వెళ్లాలంటే కనీసం రూ.12 వేలు పెట్టాల్సిందే. నలుగురు సభ్యులున్న ఫ్యామిలీ వెళ్లాలంటే రూ.50 వేల నుంచి 70 వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. సాధారణ రోజుల్లో హైదరాబాద్, బెంగళూరు నుంచి కనీస ధర మామూలుగా రూ.3,400 నుంచి రూ.4 వేలు ఉంటుంది. ప్రస్తుతం దానికి భిన్నంగా మూడు నాలుగు రెట్లు పెరిగింది. అయినప్పటికీ, సొంతూళ్లకు వెళ్లాలనే ప్రయాసతో కొంత మంది వేలకు వేలు పెట్టుకొని మరీ కుటుంబాలతో ప్రయాణాలు సాగిస్తున్నారు.



## ఆప్ ఎమ్మెల్యే అనుమానాస్పద స్థితిలో మృతి

- దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు!

**టీ మీడియా, జనవరి 11, ఢిల్లీ:**

లూథియానా వెస్ట్ ఎమ్మెల్యే, ఆమ్? ఆద్మీ పార్టీ (ఆప్) నేత గురుప్రీత్ గోగి శుక్రవారం రాత్రి బుల్లెట్ గాయాలతో అనుమానాస్పద స్థితిలో మరణించారు. అయితే 'శుక్రవారం రాత్రి గురుప్రీత్ పొరపాటున తనను తానే తలపై కాల్చుకున్నట్లు' ఆయన కుటుంబ సభ్యులు చెబుతున్నారని పోలీసులు తెలిపారు.శుక్రవారం సుమారు 12 గంటల సమయంలో గురుప్రీత్? గోగి ఇంట్లో కాల్పులు జరిగాయి. గురుప్రీత్? తలపై బుల్లెట్? గాయాలు కావడం వల్ల కుటుంబ సభ్యులు, ఆయనను ఆసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే ఆయన మరణించినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు మాత్రం, ప్రమాదవశాత్తు గురుప్రీత్ తనను తానే తుపాకీతో కాల్చుకున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం మృతదేహాన్ని మార్చురీలో ఉంచారు. పోస్ట్?మార్టం అయిన తరువాత మరణానికి గల అసలు కారణాలు స్పష్టంగా తెలిసే అవకాశం ఉంది. ప్రస్తుతం కేసు నమోదు చేసి ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నాం" అని లూథియానా డీసీపీ జస్కరణ్? సింగ్ తేజ పేర్కొన్నారు.

మరణానికి కొన్ని గంటల ముందు గురుప్రీత్ గోగి – విధాన సభ స్పీకర్ కుల్తార్ సింగ్ సంధ్వన్, ఆప్ ఎంపీ బల్బీర్ సింగ్? సీచెవాల్?తో సమావేశమయ్యారు. ఇందులో 'బుద్ధ నల్ల' (బుధ వాగు)ను శుభ్రపరిచే అంశంపై చర్చించారు.

**రాజకీయ నేతల సంతాపం**

గురుప్రీత్ గోగి మరణం పట్ల పలువురు రాజకీయ నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. లూథియానాలోని ఆయన నివాసానికి వచ్చి, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో గురుప్రీత్? కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. ఆయన ఆత్మకు శాశ్వత శాంతి చేకూరాలని నేను ఆ దేవుని ప్రార్థిస్తున్నాను అన్నారుఅమన్ ఆరోరా, పంజాబ్ ఆప్ అధ్యక్షుడు

**ఆప్‌లో కీలకపాత్ర**

2022లో కాంగ్రెస్ పార్టీని వీడిన గురుప్రీత్ గోగి ఆప్? పార్టీలో చేరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో, లూథియానా నుంచి రెండు సార్లు కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఎన్నికైన భరత్? భూషణ్? ఆశును ఓడించారు.



## పండుగ వేళ ఘోర విషాదం..

- సెల్ఫీ కోసం వెళ్లి ఐదుగురు మృతి..

**టీ మీడియా, జనవరి 11, మార్కుక్:**

తెలంగాణలోని సిద్దిపేట జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది.. మార్కుక్ మండలం కొండపోచమ్మ సాగర్ డ్యాంలో ఏడుగురు గల్లంతయ్యారు.. వారిలో ఐదుగురు మరణించారు.. ఇద్దరిని స్థానికులు కాపాడారు.. చనిపోయిన వారంతా 20 ఇళ్లలోపు వారే ఉన్నారు.. వివరాల ప్రకారం.. హైదరాబాద్ లోని ముషీరాబాద్ ప్రాంతానికి చెందిన యువకులు శనివారం కొండపోచమ్మ సాగర్ డ్యాం వద్దకు వెళ్లారు. ఈ క్రమంలోనే ఈత కొట్టేందుకు దిగి.. అంతా మునిగిపోయారు.. ఏడుగురు యువకులు కూడా గల్లంతయ్యారు.. వారిలో ఐదుగురు నీట మునిగి చనిపోయారు.. ఇద్దరిని.. స్థానికులు కాపాడారు..మృతులు ముషీరాబాద్ ప్రాంతానికి చెందిన ధనుష్ (20), లోహిత్ (లక్కీ) (17), చీకట్ల దినేశ్వర్ (17), సాహిల్ (19), జతిన్ (17) గా గుర్తించారు.. కోమరి మృగంక్, ఎండి ఇబ్రహీం ఇద్దరూ బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.. ఈ ఘటన పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.సెల్ఫీ కోసం డ్యామ్‌లోకి యువకులంతా డ్యాంలోకి దిగారు.. ఒకరి చెయ్యి ఒకరు పట్టుకుని ఏడుగురు డ్యామ్‌లోకి దిగారని పేర్కొంటున్నారు.. ఐదుగురు నీటిలో మునిగారు.. వీరిలో ఇద్దరు బయటపడ్డారని స్థానికులు తెలిపారు.కొండపోచమ్మ సాగర్ డ్యాంలో గల్లంతై ఐదుగురు మరణించడంపై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు.. గజ ఈతగాళ్లను రంగలోకి దించాలని.. అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.ఈ విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

**అన్నదమ్ములు మృతి**

చనిపోయిన అన్నదమ్ములైన ధనుష్, లోహిత్ భోలక్ పూర్ డివిజన్ ఇందిరానగర్?లో నివాసం ఉంటున్నారు. తండ్రి నర్సింగరావుకు ఫోటో స్టూడియో ఉంది. ఆయనకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు. కూతురు వివాహమైంది. ధనుష్ తండ్రి ఫోటో స్టూడియో చూసుకుంటుండగా, లోహిత్ టీకేఆర్ కాలేజీలో డిప్లొమా రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఉదయం 8.30 గంటలకు స్నేహితులతో కలిసి బైక్?లపై కొండపోచమ్మ సాగర్‌కు వెళ్లారు. అదే వారి చివరి ప్రయాణమైంది.

### నేతల సంతాపం

కొండపోచమ్మ సాగర్ ప్రమాదంపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. యుక్తవయసులోనే యువకులు అకాల మరణం చెందడం కుటుంబాలకు తీరని లోటని, మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలవాలని కోరారు. మాజీ మంత్రి మాజీమంత్రి హరీశ్ రావు కూడా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. పండుగ వేళ బిడ్డల్ని కోల్పోయి బాధలో ఉన్న కుటుంబాలకు రూ. 15 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అటు కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్? కూడా ప్రమాదంపై విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# సంక్రాంతికి మూడు పప్పులతో చెక్కలు

- కరకరలాడుతూ నోరూరిస్తాయి

**టీ మీడియా, జనవరి 11,వంటలు:**




సంక్రాంతి పిండి వంటల్లో చాలా మంది చెక్కలను ప్రిపేర్ చేసుకుంటుంటారు. అయితే, మీరు ఇప్పటి వరకు ఎన్నో రకాలుగా వీటిని తయారు చేసుకొని ఉంటారు. కానీ, ఈ పండక్కి ఎప్పటిలా కాకుండా కాస్త వెరైటీగా ప్రయత్నించండి. ఇలా మూడు పప్పులను కలిపి చెక్కలను చేసుకోండి. చాలా రుచికరంగా ఉండి కరకరలాడుతూ తిన్నాకొద్దీ తినాలనిపిస్తుంది. పైగా వీటి కోసం ఎక్కువ శ్రమించాల్సిన పనిలేదు. ఎవరైనా చాలా ఈజీగా ప్రిపేర్ చేసుకోవచ్చు. మరి, ఈ క్రిస్పీ అండ్ టేస్టీ చెక్కలకు కావాల్సిన పదార్థాలేంటి? ఎలా తయారు చేసుకోవాలి? అనే వివరాలు ఈ స్టోరీలో తెలుసుకుందాం.

**కావాల్సిన పదార్థాలు :**

పచ్చిశనగపప్పు 2టేబుల్స్పూన్లు.పెసరపప్పు– 2టేబుల్స్పూన్లు.మినపప్పు – 2 టేబుల్?స్పూన్లు.బియ్యప్పిండి – 2 కప్పులు.తెల్ల నువ్వులు – 1 టేబుల్?స్పూన్.సన్నగా తరిగిన కరివేపాకు – కొద్దిగా.కారం – రుచికి తగినంత.పసుపు – పావుటీస్పూన్.ఉప్పు – రుచికి సరిపడా.ఇంగువ – అరటీస్పూన్.బటర్ – 1 టేబుల్ స్పూన్.నూనె – వేయించడానికి తగినంత.

**తయారీ విధానం**

ఇందుకోసం ముందుగా కుక్కర్?లో పచ్చిశనగపప్పు, పెసరపప్పు, మినపప్పును తీసుకొని శుభ్రంగా కడిగి అర గ్లాసు లేదా కప్పు వాటర్ పోసుకోవాలి. ఆ తర్వాత మూతపెట్టి మీడియం ఫ్లేమ్? మీద 5 విజిల్స్ వచ్చేంత వరకు ఉడికించుకోవాలి.అనంతరం కుక్కర్ ప్రెజర్ మొత్తం పోయాక మూతతీసి మెత్తగా ఉడికిన పప్పులను కాస్త పలుకుగా ఉండేలా మాష్ చేసుకోవాలి. మరీ, మెత్తగా చేసుకోవద్దు.ఒకవేళ మీకు మాష్ చేసుకోవడం ఇష్టం లేకపోతే ఉడికించుకున్న పప్పును మిక్సీ జార్?లోకి తీసుకొని ఒక్కసారి కాస్త అలా గ్రైండ్ చేసుకున్నా సరిపోతుంది. తర్వాత ఆ పప్పును ఒక మిక్సింగ్? బౌల్?లోకి తీసుకొని అందులో బియ్యప్పిండి, తెల్ల నువ్వులు, సన్నని కరివేపాకు తరుగు, కారం, ఇంగువ, ఉప్పు, బటర్ వేసుకొని ఇంగ్రిడియంట్స్ అన్నీ కలిసేలా బాగా కలుపుకోవాలి.అన్నింటినీ చక్కగా మిక్స్ చేసుకున్నాక ఒకసారి కొద్దిగా పిండిని నోట్లో వేసుకొని ఉప్పు, కారం మీ టేస్ట్?కి తగినట్లు ఉన్నాయో లేదో చూసుకోవాలి.అనంతరం ఆ మిశ్రమంలో తగినన్ని నీళ్లను కొద్దికొద్దిగా యాడ్ చేసుకుంటూ చపాతీ ముద్దలా పిండిని బాగా కలుపుకోవాలి. ఆ తర్వాత కొంచెం కొంచెం పిండిని తీసుకొని కొన్ని చిన్న చిన్న ఉండలు చేసుకోవాలి. ఆపై పిండి డ్రై అవ్వకుండా బౌల్?పై మూతని ఉంచాలి. ఇప్పుడు పూరీ ప్రెస్ తీసుకొని దానిపై ప్లాస్టిక్ కవర్ ఉంచి కొద్దిగా ఆయిల్ అప్లై చేసుకొని పిండి ఉండను పెట్టి మీకు కావాల్సిన సైజ్?లో నెమ్మదిగా ఒత్తుకోవాలి.పూరీ ప్రెస్ లేనివారు పాలిథిన్ కవల్ లేదా బటర్ పేపర్?పై కాస్త నూనె రాసి ఒక్కో ఉండను ఉంచి చేతితో లేదా ఏదైనా పూరీ షేప్?లో ఉండే గ్లాసు లేదా గిన్నెతో ఒత్తుకున్నా సరిపోతుంది. అయితే, మరీ పల్చగా, మందంగా కాకుండా మీడియం థిక్?నెస్?తో ఉండేలా చెక్కలను ఒత్తుకోవాలి.ఆ విధంగా కొన్ని చెక్కలను చేసుకున్నాక వాటిపై ఫోర్క్ చెంచాతో అక్కడక్కడ లైట్గా హోల్స్ పెట్టండి. ఇలా చేయడం ద్వారా ఆయిల్?లో వేసినప్పుడు ఎక్కువ పొంగకుండా చక్కగా కాలుతాయి. అనంతరం స్టౌపై పాన్ పెట్టుకొని నూనె పోసుకోవాలి. ఆయిల్ బాగా వేడయ్యాక మంటను తగ్గించి ముందుగా చేసుకున్న చెక్కలను ఒక్కొక్కటిగా కాగుతున్న నూనెలో వేసుకొని లైట్ గోల్డెన్ బ్రౌన్? కలర్?లోకి వచ్చేంత వరకు కాల్చుకోవాలి.తర్వాత వాటిని పేపర్ నాప్?కిన్ ప్లేట్?లోకి తీసుకుంటే అదనపు ఆయిల్?ని అది పీల్చేసుకుంటుంది. అనంతరం ఏదైనా డబ్బాలో స్టోర్ చేసుకుంటే చాలు.అంతే, కరకరలాడుతూ నోరూరించే "పప్పు చెక్కలు" రెడీ!

# నాంపల్లి కోర్టులో అల్లు అర్జున్‌కు ఊరట

- ఆదివారం హాజరు నిబంధన మినహాయింపు

**టీ మీడియా, జనవరి 11,హైదరాబాద్:**



అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టులో ఊరట లభించింది. ప్రతి ఆదివారం చిక్కడ్‌పల్లి పోలీసుల ఎదుట హాజరు కావాలని ఇది వరకు విధించిన షరతు నుంచి మినహాయింపునిస్తూ నాంపల్లి కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. షుటింగ్ నిమిత్తం విదేశాలకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలన్న అల్లు అభ్యర్థనను నాంపల్లి కోర్టు అంగీకరించింది.నాంపల్లి కోర్టులో అల్లు అర్జున్‌కు ఊరట : సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో చిక్కడ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఓ మహిళ మృతి చెందడంతో పాటు ఆమె కుమారుడికి తీవ్ర గాయాలు కావడంతో సంధ్య థియేటర్ యాజమాన్యంతో పాటు అల్లు అర్జున్, ఆయన ప్రైవేటు భద్రతా సిబ్బందినా పైనా పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. తర్వాత అల్లు అర్జున్‌ను చిక్కడ్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. హైకోర్టులో మధ్యంతర బెయిల్ పొందిన అల్లు అర్జున్ మరుసటి రోజే జైలు నుంచి విడుదలయ్యారు. ఆ తర్వాత రెగ్యులర్ బెయిల్ కోసం నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.ఇది వరకే ఈ పిటిషన్‌పై విచారణ నిర్వహించిన నాంపల్లి కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. సొంత పూచీకత్తు సమర్పించడంతో పాటు ప్రతి ఆదివారం చిక్కడ్‌పల్లి పోలీసుల ఎదుట హాజరయ్యి దర్యాప్తునకు సహకరించాలని ఆదేశించింది. దీంతో షుటింగ్ నిమిత్తం విదేశాలకు వెళ్లాలని అల్లు అర్జున్ నాంపల్లి కోర్టును అభ్యర్థించారు. భద్రతా కారణాల దృష్ట్యా ప్రతి ఆదివారం పీఎస్ ఎదుట హాజరునుంచి మినహాయింపునివ్వాలని ఆయన తరపు న్యాయవాది కోర్టును కోరారు. అల్లు అర్జున్ పిటిషన్‌పై సానుకూలంగా స్పందించిన నాంపల్లి కోర్టు ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.శ్రీతేజ్‌ను పరామర్శించిన నటుడు అల్లు అర్జున్ : సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో గాయపడిన శ్రీతేజ్‌ను నటుడు అల్లు అర్జున్ పరామర్శించారు. కిమ్స్ ఆసుపత్రికి నిర్మాత దిల్ రాజుతో వెళ్లి బాలుడి ఆరోగ్య పరిస్థితి, చికిత్సకు ఏ విధంగా స్పందిస్తున్నాడనే విషయాలు వైద్యులను అడిగి తెలుసుకున్నారు. శ్రీ తేజ్ తండ్రితో కూడా మాట్లాడి కుటుంబానికి అండగా ఉంటానని, భరోసా కల్పించారు.

# అర్థవంతంగా శిక్షణ కార్యక్రమం

- రాంశెట్టి నరేందర్ కి అభినందనలు
- ఆర్కె 7ఏ ఫిట్ సెక్రటరీ మహేందర్

**టీ మీడియా, జనవరి11 మంచిర్యాల బ్యూరో:**




విజయవాడలో పారిశ్రామిక సంబంధాలు, పరిశ్రమల్లో రక్షణ,ఆరోగ్యం అనే అంశంపై జరుగుతున్న శిక్షణ కార్యక్రమం మొదటి రోజు అర్థవంతంగా ముగిసిందని ఐఎన్టియుసి మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాంశెట్టి నరేందర్ తెలిపారు. విజయవాడలోని పార్క్ ఎన్ హోటల్లో జపాన్ కు చెందిన 'జపాన్ ఇంటర్నేషనల్ లేబర్ ఫౌండేషన్ ,ఐ ఎన్ టీ యు సి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో మొదటి రోజు ఉదయం పరిశ్రమల్లో ఉద్యోగుల ఆరోగ్యం, రక్షణ పై జపాన్ ఇంటర్నేషనల్ లేబర్ ఫౌండేషన్ అధ్యక్షుడు యసునోబు అహిర సాన్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ హితోషి సుజుకి సాన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ యుకో కటో సాన్, పవన్ కుమార్ ఐ టి సి జి ఏం గార్లచే కార్యక్రమాన్ని నిర్వహించారని, మధ్యాహ్నం డా.మహేష్వర్ ఎడ్యుకేషన్ ఆఫీసర్(సెంట్రల్ బోర్డ్ ఫర్ వర్కర్స్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్మెంట్– గవర్నమెంట్ ఆఫ్ ఇండియా) చే మరియు శ్రీ.వీరాస్వామి ఐటీసి–ఏ డి బి వైస్ ప్రెసిడెంట్ గార్లచే శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారని, ఈ కార్యక్రమం ద్వారా ఎన్నో కొత్త విషయాలను తెలుసుకునే అవకాశం వచ్చిందని తనకు ఈ గొప్ప అవకాశం ఇచ్చినందుకు ఐ ఎన్ టి యు సి జాతీయ అధ్యక్షులు డాక్టర్ జి సంజీవరెడ్డి కి మరియు సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ సెక్రటరీ జనరల్, ఐ ఎన్ టీ యు సి జాతీయ కార్యదర్శి రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ శ్రీ బి జనక్ ప్రసాద్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు నరేందర్ తెలిపారు.

## బెల్టు గ్రేడింగ్ పోటీలో బెల్టులు ప్రధానం

**టీ మీడియా, జనవరి 12, వనపర్తి బ్యూరో :**



వనపర్తి గ్రామంలో గోజూరియో కరాటే %ఢ% కిక్ బాక్సింగ్ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహించిన బెల్టు గ్రేడింగ్ పోటీ పరీక్షలో చిట్యాల గ్రామానికి చెందిన 18 మంది విద్యార్థులు పాల్గొనీ గెలుపొందారు. వీరినీ కాంగ్రెస్ నాయకులు మాజీ ఉపసర్పంచ్ గౌరగల్ల నరసింహ , వెంకటయ్య , నరహరి ,గౌర గల్ల వెంకటేష్,వార్డ్ మెంబర్ రేణుకా, గోజూరియో కరాటే అధ్యక్షులు కరాటే శేఖర్ మాస్టరు, చిట్యాల అకాడమి మాస్టరు వరుణ్ అభినందిస్తూ బెల్టులను ప్రదానం చేయడం జరిగింది.

## వివేకానంద జయంతి విజయవంతం చేయాలి

**టీ మీడియా,జనవరి 11, చిన్నంబావి:**



చిన్నంబావి మండల పరిధిలోని పెద్ద దగడ గ్రామంలో ఆదివారం జరిగే వివేకానంద జయంతి వేడుకలను విజయవంతం చేయాలని పెద్ద దగడ గ్రామం లో వివేకానందుని జయంతికి గ్రామ వివేకానంద యూత్ అధ్యక్షుడు భోగరాజు వెంకటేష్, ప్రధానకార్యదర్శి రజినీ బాబు, ఉపాధ్యక్షులు పెరుమాళ్ళ శ్రీనివాస్, లు పిలుపునిచ్చారు. అదేవిధంగా ఆదివారం నిర్వహించే వివేకానంద జయంతి వేడుకలను మండల పరిధిలోని వివిధప్రజాసంఘాలు, విద్యార్థులు, యువత పాల్గొని ఆయనకు ఘన నివాళి అర్పించాలని పిలుపునిచ్చారు.

## వైజయంతి నవల ఊహాత్మకమే, రాయడానికి యాబై ఏళ్లు : విహారి

**టీ మీడియా, జనవరి 11,హైదరాబాద్:**



సాహిత్యంలో స్వేచ్ఛగా విహరించే కథరాజు మా విహారి అని నేను అంటుంటాను. ఈరోజు సభ ప్రాంగణంలో కూడా తను తనకు నచ్చిన విధంగా విహరిస్తూనే ఉన్నారు. ఒక పుస్తకం ఆవిష్కరింపబడిందా లేదా అనే ఆలోచనను కలిగిస్తున్న సందర్భమిది. పండితరాయలు అనే నవల సాహితీ లోకంలో విహరిస్తూ ఉంది." –కేవీ రమణాచారి, రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారుపండిత జగన్నాథరాయలు 17వ శతాబ్దంలో పండిత బ్రాహ్మణుడై కూడా, మొఘల్ చక్రవరి జహంగీర్ వద్ద సలహాదారుగా ఉండి 'పండితరాయలు' అని బిరుదు పొందారని రమణాచారి కీర్తించారు. జహంగీర్ కంటే ఆయన భార్య నూర్జహాన్? జగన్నాథరాయలును గౌరవించేవారని, మహారాణి అయినప్పటికీ ఆయన మాటలు శిరసావహించేవారన్నారు.జహంగీర్ తరువాత ఆయన కుమారుడు షాజహాన్ సైతం పండితరాయలును సత్కరించారని చరిత్రను గుర్తుచేశారు. ఆ సమయంలో తన సింహాసనంలో అర్థభాగమిచ్చి గౌరవించారంటే జగన్నాథరాయలు ఎంత గొప్పవాడో అర్థమవుతోందన్నారు. చరిత్ర మరుస్తున్న ప్రస్తుత సమయంలో ఇలాంటి చారిత్రక నవలలు మరిన్ని రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.తన 50యాభై ఏళ్ల కృషికి అక్షరరూపమే వైజయంతి అని రచయిత విహారి ఉద్ఘాటించారు. ఈ ప్రయత్నంలో తనకు సహకరించిన వారందరికి కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. కేవీ రమణాచారి ముందుమాట రాసినందుకు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## భారతీయ సంస్కృతికి ప్రతీక ముగ్గు

- సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్

**టీ మీడియా, జనవరి 11, వనపర్తి బ్యూరో :**



అనాదిగా వస్తున్న భారతీయ సంస్కృతికి ప్రతీకలు ముగ్గులు అని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు. శనివారం శ్రీరంగాపురం మండల కేంద్రంలో సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ముత్యాల ముగ్గుల పోటీని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు నలభై మహిళలు ఈ పోటీలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతి ప్రదాన కార్యక్రమంలో శంకర్ గౌడ్ మాట్లాడుతూ వేల సంవత్సరాల కిందటి నుండే ముగ్గులు వేసే సంప్రదాయం మన దేశంలో ఉందని ఆయన అన్నారు. ఇప్పటికే పల్లెటూళ్ళలో తమ ఇళ్లను పేడతో అలికి రంగవల్లులతో అలంకరించుకునే ఆనవాయితీని మనం చూడవచ్చని ఆయన తెలిపారు. పల్లెల్లోని మహిళలను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో ఇక్కడ జిల్లా స్థాయి ముగ్గుల పోటీని ఏర్పాటు చేసినట్లు శంకర్ గౌడ్ వివరించారు.ఈ ముగ్గుల పోటిలో చిన్న వయసు గల ఆడపిల్లలు ఉత్సాహంగా పాల్గొనడం ఆనందంగా ఉందని శంకర్ గౌడ్ పేర్కొన్నారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన శివమ్మ (ప్రథమ), సునీత (ద్వితీయ), ఉషారాణి (తృతీయ)లకు వరుసగా ఐదువేలు, మూడువేలు,రెండువేల రూపాయల నగదు బహుమతులను అందజేశారు.పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతులు ఇచ్చారు.ఈనాటి కార్యక్రమంలో కళావేదిక ప్రతినిధులు జనజ్వాల, బైరోజు చంద్ర శేఖర్, జయంత్ రెడ్డి,రాజకీయ నాయకులు రాజేంద్ర ప్రసాద్,కురుమయ్య, బీరం రాజశేఖర్ రెడ్డి, వెంకటయ్య,రాముడు,పర్వతాలు,రాజగౌడ్,రవీందర్ గౌడ్,రవి కుమార్,శ్రీ లక్ష్మీ, కవిత,జ్యోతి,శ్రావణి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పార్థివ దేహానికి నివాళులు అర్పించిన డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి, ఆదిత్య రెడ్డి

**టీ మీడియా, జనవరి 11, వనపర్తి బ్యూరో :**



పెబ్బేరు మండలం గుమ్మడం గ్రామానికి చెందన సొగ్గయ్య గోపాలమ్మ అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం అధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి , ఏఐసిసి స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి వారి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు. గోపాలమ్మ పాడెను చిన్నారెడ్డి , ఆదిత్య రెడ్డి మోశారు. గోపాలమ్మ కుటుంబ సభ్యులను బాధ నుంచి త్వరగా కోలుకోని ధైర్యంగా ఉండాలని మనోధైర్యం చెప్పారు.నివాళులర్పించినవారు పెబ్బేర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకట్ రాములు యాదవ్, పెద్దమందడి మండల్ సింగల్ విండో మాజీ అధ్యక్షుడుఐ . సత్య రెడ్డి,పెబ్బేర్ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కృష్ణ, సహ దేవుడు, భాస్కర్, గట్టు రాజు, బంధుమిత్రులు, తదితరులు పాల్గొన్నారు.

## గిరి ప్రదక్షణ విజయవంతం

**టీ మీడియా, జనవరి 11 ,చిన్న చింతకుంట :**



విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం పేదల తిరుపతి గా పేరుగాంచిన కురుమూర్తి గిరి ప్రదక్షిణ విజయవంతంగా జరిగింది. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా తోపాటు వివిధ ప్రాంతాల నుండి అశేష జనవాహిని ఉదయం 9:00 కల్లా కురుమూర్తి గిరిలకు చేరుకున్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే, వనపర్తి ఎమ్మెల్యే, తోపాటు విశ్వహిందూ పరిషత్తు సభ్యులు, దేవరకద్ర బిజెపి ఇన్చార్జి కొండా ప్రశాంత్ రెడ్డి స్వామీజీలు జెండా ఊపి గిరి ప్రదక్షిణను ప్రారంభించారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మెగా రెడ్డి తో పాటు, మాజీ జడ్పీ చైర్మన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు ముద్ది యాదిరెడ్డి తోపాటు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు, సాధువులు హిందూ బంధువులు పాల్గొన్నారు. మహిళలు, పిల్లలు, యువకులు, వివిధ ధార్మిక సంఘాల సభ్యులు వేలాదిగా పాల్గొని కురుమూర్తి గుట్ట చుట్టూ దాదాపు ఐదు కిలోమీటర్లు ప్రదక్షిణ చేసి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి కృప యావత్ హిందూ బంధువుల పై ఉండాలని కోరుకున్నామన్నారు.

## అవొపా మహిళా విభాగ్ ఆధ్వర్యంలో ముగ్గులు పోటీలు

**టీ మీడియా, జనవరి 11, వనపర్తి బ్యూరో :**




ప్రభుత్వ బాలుర పాఠశాలలో అవొపా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి 4000/– బిందుప్రియ, రెండు బహుమతి 3000/– కే శివాని, మూడవ బహుమతి 2000/– డి జ్యోతి , కన్సలేషన్ బహుమతి 1000 /–మౌనిక గెలిచేకున్నారు. నాయ్య నిర్ణేతలు గా ఎల్ శ్రీదేవి, ఎస్ పద్మజ, ఈపూరి లావణ్య, పాల్గొన్నారు. నూకల సత్య నారాయణ 10000 రూపాయలు స్పాన్సర్ చేయడం జరిగింది. పార్టీసిపేషన్ బహుమతులు రామ్ షా సూపర్ మార్కెట్ అధినేత రామకృష్ణ ఇచ్చారు. అవొపా జిల్లా అధ్యక్షురాలు లగ్గిశెట్టి శైలజ ధన్యవాదాలు తెలిపారు . ఈ కార్యక్రమంలో ఎల్ శ్రీనివాసులు, కే శ్రీనివాసులు, మహేష్, దోమ శ్రీనివాసులు, జిల్లా పరీక్ష అధికారి గణేష్, ఘనపురం మండలం విద్య అధికారి జయశంకర్, పట్టణ మహిళ కార్యకర్తలు జిల్లా అవొపా మహిళా విభాగ్ పాల్గొన్నారు.

## పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు

**టీ మీడియా, జనవరి 11, రామకృష్ణాపూర్:**



రామకృష్ణాపూర్ లోని తవక్కల్ పాఠశాలలో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు.పాఠశాల పేరెంట్స్ కు,ప్రైవేట్ పాఠశాలల టీచర్స్ కు ముగ్గుల పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తవక్కల్ విద్యా సంస్థల ఛైర్మన్ అబ్దుల్ అజీజ్,అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మెన్ నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ అందరికి ముందుగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలియచేశారు.అనంతరం ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి ముఖ్య అతిథులచే బహుమతులు అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ట్రాస్మా మంచిర్యాల జిల్లా కమిటీ సభ్యులు,మునిసిపల్ చైర్మన్ జంగం కళ,వైస్ ఛైర్మన్ సాగర్ రెడ్డి,కాంగ్రెస్ నాయకులు గాండ్ల సమ్మయ్య,పలు కౌన్సిలర్లు లు పాల్గొన్నారు.

## దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొన్న ఆదిత్యా రెడ్డి

**టీ మీడియా, జనవరి 11, వనపర్తి బ్యూరో :**



వనపర్తి జిల్లా మత్యకార సెల్ ఉపాధ్యక్షులు నరేందర్ వాళ్ళ అక్క కూతురు సి, రేవతి దశదినకర్మకు ఏఐసిసి స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి హాజరై రేవతి చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పించడం జరిగింది. రేవతి అమ్మ నాన్నలను ఓదార్చు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.రేవతి మరణించిన విషయం నుంచి త్వరగా కోలుకోవాలని ధైర్యంగా ఉండాలని మనోధైర్యం చెప్పారు. పరామర్శించిన ఘణపురం మండల అధ్యక్షుడు విజయ బాబు, జిల్లా వికలాంగుల సెల్ అధ్యక్షుడు గంజాయి రమేష్, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ దేవన్న యాదవ్, ఘణపురం గ్రామ అధ్యక్షుడు నారాయణ, బాల్ రాజు, కృష్ణయ్య యాదగిరి, పెద్దమందడి సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టురాజు, ప్రతాప్ ఉన్నారు.

## సంక్రాంతి సందర్భంగా ముందస్తుగా రంగవల్లి

**టీ మీడియా, జనవరి 11, రామకృష్ణాపూర్:**



క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ పట్టణం లో సెయింట్ జోసెఫ్ హైస్కూల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలను శనివారం విద్యార్థులు, ఉపాధ్యాయులు ముగ్గులతో రంగవల్లితో ఘనంగా జరుపుకోవడం జరిగింది.ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఈదునూరి సారంగరావు మాట్లాడుతూ అన్ని తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా వివిధరకాలైన ముగ్గులువేసి అలంకరించాలని, అలాగే మన సంస్కృతి సంప్రదాయాలను భవిష్య తరాలకు అందించే ఉద్దేశంతో రంగవల్లి కార్యక్రమం నిర్వహించడం జరిగిందని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీ.సీ.సంక్షేమ సంఘంఇంచార్జ్‌గా తిరుమల ప్రమోద్ గౌడ్

**టీ మీడియా ,జనవరి 11,ఎండపల్లి :**



మండలం జాతీయ బీ.సీ.సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజాల శ్రీనివాస్ గౌడ్ ఆదేశాలమేరకు జగిత్యాల జిల్లా అధ్యక్షులు బేరి నరేష్, మండలం లోని కొండాపూర్ గ్రామానికి చెందిన తాజా మాజీ వార్డ్ మెంబెర్ తిరుమల ప్రమోద్ గౌడ్ కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తిరుమల ప్రమోద్ గౌడ్ మాట్లాడుతూ నియామక పత్రానికి సహకరించిన రాష్ట్ర కార్యదర్శి గాజుల నాగరాజు, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గంగంజలజ, జిల్లా ప్రధానకార్యదర్శి భూమి రమణ, జిల్లా ఉపాధ్యక్షులు ముత్యాల స్వామి, ఎండపల్లి మండల అధ్యక్షులు మందపల్లి శ్రీనివాస్,వెల్గటూర్ మండల అధ్యక్షులు పసుపునూటి అనిల్ కు కృతజ్ఞతలు తెలియ జేస్తూ బీసీలు రాజకీయంగా,ఆర్థికంగా సామాజికంగా చట్ట సభల్లో ఉద్యోగ అవకాశాలల్లో బీసీలు ఎదుగాలని జనాభా ప్రతి పాధికనా కోసం రిజర్వేషన్ ల అమలు కోసం తన వంతు పోరాటం చేస్తానని ఈ సందర్భంగా తెలియజేసారు.

## నందీశ్వర ఉడిపి హోటల్ సందర్శించిన ఆదిత్య రెడ్డి

**టీ మీడియా, జనవరి 11, వనపర్తి బ్యూరో :**



వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరే రాములు యాదవ్ నందీశ్వర ఉడిపి హోటల్ ను ఈనెల మూడో తేదీన ప్రారంభించడం జరిగింది. కొన్ని అనివార్య కారణాల చేత ప్రారంభోత్సవానికి రాలేకపోయినా వనపర్తి నియోజకవర్గ యువ నాయకుడు ఏఐసిసి స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి శినివారం హోటల్ ని సందర్శించి కదిరే రాముల యాదవ్ ని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. హోటల్ వ్యాపారం మూడు పూలు ఆరుకాయలుగా విస్తరించాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. హోటల్లో నాణ్యమైన ఆహార పదార్థాలను వాడి కస్టమర్ల ఆరోగ్యాన్ని కాపాడాలని రాము యాదవ్ కి సూచించారు. కదిరే రాముల యాదవ్ ఆదిత్య రెడ్డి ని శాలువతో సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పెద్దమందడి మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సి పెంటన్న యాదవ్, గోపాల్పేట్ మండల్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ జిల్లెల ప్రవీణ్ కుమార్ రెడ్డి, సీనియర్ నాయకులు అబ్దుల్లా, పెద్దమందడి సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు తదితరులు పాల్గొన్నారు.

**ఎద్దుల రాముడు మృతి పట్ల ప్రగాఢ సానుభూతి**

పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ ఎద్దుల కరుణ శ్రీ మామ గ్రూప్ మేస్త్రి ఎద్దుల రాముడు మరణించిన విషయం తెలుసుకున్న ఏఐసిసి స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించారు.కొన్ని అనివార్య కారణాల చేత అంత్యక్రియలకు హాజరు కాలేకపోయానని తెలిపారు. మీ కుటుంబ పెద్దదిక్కుఎద్దుల రాముడు మరణం నుంచి కోలుకొని ధైర్యంగా ఉండాలని మనోధైర్యం చెప్పారు. పరామర్శించిన వాళ్ళు పెబ్బేరు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకట్ రాముల యాదవ్, సహదేవుడు తదితరులు ఉన్నారు.

## జిల్లా కౌన్సిల్ మెంబర్ల నియామకం

**టీ మీడియా, జనవరి 11, వనపర్తి బ్యూరో :**

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు,కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ఆదేశానుసారం తెలంగాణ సంఘటన పర్వ్ లో భాగంగా వనపర్తి జిల్లా లోని వనపర్తి మున్సిపాలిటీ రేవల్లి మండలాలకు నూతన మండల అధ్యక్షులు , జిల్లా కౌన్సిల్ మెంబర్లను భారతీయ జనతా పార్టీ నియమావళి ప్రకారం ఎన్నిక చేసినట్లు బిజెపి రాష్ట్ర నాయకులు సంస్థాగత ఎన్నికల వనపర్తి జిల్లా రిటర్నింగ్ అధికారి చదువు రాజేందర్ రెడ్డి, సహ రిటర్నింగ్ అధికారి అక్కల రామన్ గౌడు లు ప్రకటించడం జరిగింది. మండల అధ్యక్షులు వనపర్తి మున్సిపాలిటీ –ఏ. రాజశేఖర్ గౌడ్. బీసీ గౌడ్. రేవల్లి మండలం– బాలు నాయక్ ఎస్టీ లంబాడ. జిల్లా కౌన్సిల్ నెంబర్లు : వనపర్తి మున్సిపాలిటీ – జి. గోపీనాథ్ యాదవ్ బీసీ యాదవ.రేవల్లి మున్సిపాలిటీ – అజయ్ గౌడ్ బీసీ గౌడ్ ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల గెడ్డింగ్ అధికారి చదువు రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ నూతన మండల అధ్యక్షులు , జిల్లా కౌన్సిల్ మెంబర్లు పార్టీ నియమాలకు కట్టుబడి పార్టీ ఆదేశాలను దిక్కరించకుండా క్షేత్రస్థాయిలో పార్టీ విస్తరణకు అహర్నిశలు కృషి చేయాలని పేర్కొన్నారు.

## క్రికెట్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే

**టీ మీడియా, జనవరి 11, వనపర్తి బ్యూరో :**



గోనూరు యాదగిరి స్మారకార్థం వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వనపర్తి క్రికెట్ లీగ్ సీజన్ 3 ని శనివారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మొదటగా గోనూరు యాదగిరి చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం క్రీడాకారుల పరిచయం చేసుకొని బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, స్థానిక కౌన్సిలర్లు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.